# చందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



కోల్‌సిటీ: ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



పాలకుర్తి : ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోల్‌సిటీ, అక్టోబర్ 16: రామగుండం ఎమ్మెల్యేగా మరో సారి కోరుకంటి చందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని 13వ డివిజన్ కార్పొరేటర్ రాకం లతా దామోదర్ కోరారు. డివిజన్ పరిధిలోని విఠల్‌నగర్‌లో సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో సాధించిన ప్రగతిపై ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వచ్చిన తర్వాతనే రామగుండం నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతున్న దని చెప్పారు. ఓట్ల కోసం వచ్చే ప్రతిపక్ష పార్టీల నాయకులు ఇన్నాళ్లు ఎక్కడున్నారని ప్రశ్నించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీశ్, స్రవంతి, గాజుల రమేశ్, రవీందర్, బొజ్జ శ్రీనివాస్, తిరుపతి, రాజేందర్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోతో ప్రచారం**

పాలకుర్తి, అక్టోబర్16 : సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోతో బీఆర్‌ఎస్ నాయకులు పాలకుర్తి మండలంలోని ప్రచారం చేశారు. ప్రభుత్వం గతంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, రాబోయే రోజుల్లో చేపట్టే పథకాల గురించి వివరించారు. వైస్‌ఎంపీపీ ఎర్రంస్వామి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇంజపురి నవీన్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

**చందర్ గెలుపు కోసం ప్రచారంలో ఆటోలు**

గోదావరిఖని టౌన్ , అక్టోబర్16: కారు గుర్తుకే ఓటేయ్యండి రామగుండంలో కోరుకంటి చందర్ నే గెలిపించాలంటూ ఆటోలతో ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కూడిన పోస్టర్లను ఆటోలపై అంటించి ప్రచారం నిర్వహిస్తున్నారు.

## మ్యానిఫెస్టోలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం

- బీఆర్‌ఎస్ నాయకుడు పీటీ స్వామి



మాట్లాడుతున్న పీటీ స్వామి

గోదావరిఖని, అక్టోబర్ 16: సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో అన్ని వర్గాలకూ ప్రాధాన్యం ఇచ్చారని బీఆర్‌ఎస్ నాయకుడు పీటీ స్వామి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని బలహీన వర్గాలు, ముఖ్యంగా మహిళల గౌరవం పెంచేలా కొత్త పథకాలు ఉన్నాయన్నారు. వృద్ధులు ఇతరులపై ఆధారపడకుండా తమకు తాముగా బతికేందుకు పింఛన్ మొత్తాన్ని మరింత పెంచడం హర్షణీయమన్నారు. రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడే విధంగా మేనిఫెస్టో తీర్చిదిద్దారన్నారు. 93 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా పథకం చారిత్రాత్మకమన్నారు. అర్హులకు రూ.400కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని ప్రకటించడంపై హర్షణీయమన్నారు. సమావేశంలో నాయకులు మురళీధర్ రావు, మూల విజయారెడ్డి, పర్లపల్లి రవి, తోకల రమేశ్, చిప్ప రాజేష్, మొగిలి, దేవరాజ్ తదితరులున్నారు.

## సందేశాత్మక చిత్రాలను ఆదరించండి

కోల్‌సిటీ,అక్టోబర్ 16: నేటి సమాజంలో మహిళలు ఇతరులను నమ్మి జీవితంలో ఎలా మోసపోతున్నారు..? నేటి పరిస్థితులపై తాము వెండి తెరపైకి తీసుకవచ్చిన చక్కటి సందేశాత్మక చిత్రమే గుణసుందరి కథ సినిమా అని దర్శకుడు ఓం ప్రకాశ్ తెలిపారు. స్థానిక శ్రీనివాస థియేటర్‌లో సోమవారం చిత్ర ప్రదర్శన తిలకించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుటుంబ సమేతంగా వీక్షించాల్సిన చక్కటి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకవచ్చామని, సామాన్య మధ్య తరగతి కుటుంబాల జీవితాలను ఇతివృత్తంగా తీసుకొని నిర్మించామని, ప్రేక్షకులు ఇలాంటి సందేశాత్మక చిత్రాలను ఆదరించాలని కోరారు. సామాన్య కుటుంబంలో నుంచి వచ్చిన ఓం ప్రకాష్ భారీ చిత్రాలు తీసే స్థాయికి రావడం అభినందనీయమని రామగుండం కార్పొరేటర్ల ఫోరం అధ్యక్షుడు కన్నూరి సతీశ్ కుమార్ ఉదన్నారు. కళలకు, కళాకారులకు పుట్టినిల్లుగా ఉన్న రామగుండం నుంచే ఇప్పటికే చాలా మంది కళాకారులు చిత్ర పరిశ్రమలో పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తున్నారని, గుణసుందరి కథ సినిమా కూడా మంచి ఆదరణ పొందాలని కోరారు. సమావేశంలో చిత్ర నటీ నటులు స్వప్న, మండ రమేశ్, కోట రవితోపాటు పలువురు ఉన్నారు.



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో అధికారులు

## 87 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పాలకుర్తి, అక్టోబర్16: పాలకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ని లబ్ధిదారులకు 87 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేసినట్లు తహసీల్దార్ జ్యోతి తెలిపారు. ఎన్నికలకు కోడ్ అమలులో ఉన్నందున లబ్ధిదారులను నేరుగా కార్యాలయానికి పిలిపించి, అర్హులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కాగా మండలంలోని గత 6 నెలల క్రితం వరకు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు అందరికి ఒక్కొక్కరికి లక్షనూట పదహారు రూపాయల చొప్పున కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు వచ్చాయి. లబ్ధిదారులు నేరుగా తహసీల్దార్‌లో చెక్కులు తీసుకున్నారు. వాటిని బ్యాంకులో జమ చేసుకుంటున్నారు. కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయడంతో పలువురు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తమ పేదరికాన్ని గుర్తించి, అసరాగా ఉండేందుకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారని సంతోషం వ్యక్తంచేశారు.

## నేడు 8ఏ గని మృతి కార్మికుల సంస్మరణ దినోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ అక్టోబర్ 16 : సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ – 2 పరిధిలోని 8ఏ గనిలో 16 అక్టోబర్ 2003లో అర్ధరాత్రి జరిగిన ఘోరప్రమాదంలో 10మంది కార్మికులు బండ కింద సమిధలయ్యారు. ఆనాడు జరిగిన ఘోర ఘటనతో బాధిత కుటుంబాలు, తోటి కార్మికులు నేటికి తేరుకోవడం లేదు. నాటి ప్రమాదంలో మరణించిన కార్మికుల స్మారకార్థం 8ఏ గని స్థూపాన్ని నిర్మించారు. మృతుల కుటుంబాల సభ్యులు స్థూపం వద్ద నేడు స్మారక సభ నిర్వహించడానికి ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రమాదం జరిగి నేటితో 20సంవత్సరాలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యానికి భారీ ప్రమాదం జరిగి 10మంది కార్మికులు మృతి చెందినా వారిపై యాజమాన్యం ఇప్పటి వరకు వారిపై చర్యలు తీసుకోకపోవడంపై బాధిత కుటుంబాలు, తోటి కార్మికులు ఆవేదన చెందుతున్నారు. కోర్టు ఆఫ్ ఎంక్వయిరీ నివేదికను బహిర్గతపరిచి బాధ్యులైన వారిపై ఇప్పటికైన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి.

**ప్రమాదంలో మృతి చెందిన కార్మికులు వీరే....**

8ఏ గని ప్రమాదంలో బండ కూలి 10మంది కార్మికులు మృతి చెందిన వారిలో మైనింగ్ సర్దార్ లంబుమల్లయ్య, కోల్‌కట్టర్ కార్మికులు ఆడప అశోక్, మీనుగు చెంద్రయ్య, టింబర్‌మెన్ కార్మికులు పిడుగు కొమురయ్య, మంథని రాజం, మామిడి మల్లేష్, కోల్‌ఫిల్లర్ కార్మికులు కన్నూరి రాయమల్లు, కాశెట్టి నారాయణ, రాగుల నర్సింగరావు, తోట బాబు.

## కుట్టుశిక్షణ కేంద్రాలు ప్రారంభం

పాలకుర్తి, అక్టోబర్16: మండలంలోని రామారావు పల్లి, జయ్యారం, పుట్నూర్‌లో విజయమ్మ కుట్టుశిక్షణ కేంద్రాలను బీఆర్‌ఎస్ మైనార్టీ అధ్యక్షురాలు ఎండీ హసీనా ప్రారంభించారు. ప్రతి గ్రామంలో కుట్టుమిషన్లు పంపిణీచేసి, మహిళలకు ఉచితంగానేర్పిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు షేర్ల లక్ష్మిపతి, పున్నంశారదసాగర్, మండల కో ఆప్షన్ సర్వర్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హసీనా

## 21 నుంచి పోలీస్ అమరుల సంస్మరణ పోటీలు

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 16: పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 21 నుంచి 31 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి తెలిపారు. పోలీసుల త్యాగాలు, సాంకేతిక వినియోగం, ప్రజల రక్షణ, పోలీసుల సేవలపై ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూలో పోటీలు ఉంటాయని వివరించారు. విద్యార్థులకు షార్ట్ ఫిలిమ్స్, ఫొటోగ్రఫీలోనూ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమర్థవంతమైన పోలీసింగ్ కోసం సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసు పాత్రపై కమిషనరేట్ పరిధిలో ముగ్గురు అభ్యర్థులను విజేతలుగా ప్రకటించి బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. పోలీసులకు వ్యాసరచన పోటీలు, రక్తదాన శిబిరాలు, పోలీసు కళా బృందంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీపీ వెల్లడించారు.

## లాభాల వాటా చెల్లించాలని టీబీజీకేఎస్ వినతి

యైటింక్లయిన్ కాలనీ, అక్టోబర్ 16: సింగరేణి సంస్థ 2022–23లోసంస్థ ఆర్జించిన లాభాలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ నాయకులు కోరారు. కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన రూ. 711కోట్ల లభాల వాటా చెల్లింపును ఎన్నికల కోడ్ నిబంధనలతో వాయిదా వేయొద్దని కోరారు. ఆర్జీ–2 డివిజన్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని అన్ని గనులు, డిపార్టుమెంట్లపై సంబంధిత అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమాల్లో చెరుకు ప్రభాకర్ రెడ్డి, కర్క శ్రీనివాస్, రవీందర్, మల్లికార్జున్, వంశీ, మల్లయ్య, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న బంగారు పుస్తెలతాడు అప్పగింత

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 16: గోదావరిఖని లక్ష్మీనగర్‌లో ఆదివారం లక్ష్మీ అనే మహిళ తులం బంగారు పుస్తెల తాడును రోడ్డుపై పోగొట్టుకుంది. బాధితురాలు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పుస్తెల తాడును కనుకొని సోమవారం ఆమెకు అప్పగించారు. క్రైమ్ టీమ్ కానిస్టేబుళ్లు తీట్ల శ్రీనివాస్, గోపతి వెంకటేశ్ సీసీ కెమెరాల తనిఖీతో 24 గంటల వ్యవధిలో బాధిత మహిళకు బంగారు పుస్తెల తాడు గొలుసును అందజేశారు. వెంటనే స్పందించిన పోలీసులకు బాధిత మహిళ కృతజ్ఞతలు తెలిపింది.

## బతుకమ్మ వేడుకలపై జీఎం సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న జీఎం

యైటింక్లయిన్ కాలనీ, అక్టోబర్ 16: సింగరేణి సంస్థ ఆర్జీ–2 ఏరియాలో ఈ నెల 20న బతుకమ్మల వేడుకల నిర్వహణపై ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జీఎం కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వివిధ విభాగాల అధికారులతో సోమవారం బతుకమ్మ వేడుకలు, సీఈఆర్ క్లబ్ డే వేడుకలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. సీఈఆర్ క్లబ్‌లో సాయంత్రం క్లబ్ డే వేడుకలు, బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. బతుకమ్మ వేడుకల్లో కాలనీ, పోతన కాలనీ, జయశంకర్‌నగర్, గాంధీనగర్ ప్రాంతాల కార్మిక, కార్మికేతర కుటుంబాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎస్‌ఓటుజీఎం అబ్దుల్ సలీం, డీజీఎం(ప) రాజేంద్రప్రసాద్, డీజీఎం (ఎ) ఎర్రన్న, డాక్టర్ మహిపాల్, సెక్యూరిటీ అధికారి షరీఫ్ అహ్మద్, జేఈ రాధాకృష్ణ, సీనియర్ పీఓ సురేందర్ పాల్గొన్నారు.

## 18న జిల్లా అథ్లెటిక్స్ పోటీలు

జ్యోతినగర్, అక్టోబర్ 16: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టీ మనోహర్‌రావు, కొమ్ము గట్టయ్య తెలిపారు. అండర్–14, 16,18,20 బాలబాలికలకు లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను సూర్యాపేటలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఈ పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలకు 9440424640 లో సంప్రదించాలని సూచించారు.